క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాసిపేట: మండలంలోని 33/11కేవీ కొండపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

చెన్నూర్: పట్టణంతో పాటు చెన్నూర్ మండలం, భీమారం, కోటపల్లి మండలాలలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. చెన్నూర్–కాటారం 132కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం కరెంట్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పట్టణ డిస్కం ఏఈ బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించనున్న దృష్ట్యా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. బజారు ఏరియాలోని రోడ్ నంబర్ 2, 3, 4లో కన్నాల బస్తీ, పోస్టాఫీసు బస్తీ, గ్రౌండ్‌బస్తీ, పెద్దనపల్లి బస్తీ, కాల్‌టెక్స్, గాంధీ నగర్, గంగారాం నగర్, టేకుల బస్తీ ఏరియాల్లో నిర్దేశించిన సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రాజీతోనే సమస్యలు పరిష్కారం



కక్షిదారులను విచారిస్తున్న జడ్జి రవి

చెన్నూర్: పరస్పరం ఘర్షణలు పడితే సమస్యలు పరిష్కారం కావని, రాజీ పడితేనే సమస్య పరిష్కారమవుతుందని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. చెన్నూర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో చెన్నూర్ కోర్టు పరిధిలోని చెన్నూర్, భీమారం, జైపూర్, కోటపల్లి, నీల్వాయి పోలీసుస్టేషన్‌లలో గల 910కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రావు, సీఐలు రవీందర్, సుధాకర్, ఏపీపీ ప్రేమలత, ఏజీపీ రాంబాబు, న్యాయవాదులు రమేశ్‌చందర్ గిల్డా, మల్లేశం గౌడ్, ఎస్సైలు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి



ఎస్సై రాజవర్ధన్

జన్నారం: మండల శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై రాజవర్ధన్ అన్నారు. శనివారం ఆయన జన్నారం మండల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు శిరీష



శిరీష

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థిని జి.శిరీష జాతీయ సీనియర్ ఉమెన్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.సుమతి తెలిపారు. ఈ పోటీలు దాదానగర్ హవేలీలో ఈ నెల 16నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయని, ఎంపికైన విద్యార్థినికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, పీడీ ఎస్.పద్మ అభినందించారు.

వీహెచ్‌పీ జిల్లా కమిటీ సమావేశం

మంచిర్యాలటౌన్: విశ్వహిందూ పరిషత్ జిల్లా కమిటీ సమావేశాన్ని శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించి, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహామూర్తి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెవెల్లి రాజలింగు, ఉపాధ్యక్షులుగా కనకతార, మొగిలయ్య, కార్యదర్శి వేముల రమేశ్, సహకార్యదర్శి రెవెల్లి మనోజ్, కోశాధికారి పాదం రవీందర్, గోసేవా ప్రముఖ్ కామెర నారాయణ, సత్సంగ్ ప్రముఖ్ సురేశ్‌శర్మ, ప్రచార ప్రముఖ్ నర్సింగ్ భవాని, గోరక్షా ప్రముఖ్ రాజసమ్మయ్య, మాతృశక్తి సంయోజిక పేర దివ్య, బజరంగ్ దళ్ సహసంయోజక్ మాదాసు మహేశ్ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల పట్టాలిప్పిస్తాం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



అర్హులకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి: సింగరేణి స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పుర ప్రజలకు శనివారం ఇళ్ల పట్టాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ఇళ్ల పట్టాలు పంపిణీ కాకుండా నిలిచిపోయాయని విమర్శించారు. నేటికీ ఇళ్ల పట్టాలు రాని ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఇళ్ల పట్టాల అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. బెల్లంపల్లి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానన్నారు. జిల్లాలోనే బెల్లంపల్లిని ప్రగతిపథంలో ముందుంచుతానని పేర్కొన్నారు. ఆ తర్వాత రూ.37లక్షలతో కొత్తగా కొనుగోలు చేసిన జేసీబీని రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే వినోద్ ప్రారంభించారు. అక్కడి నుంచి బజారుఏరియాలో ఉన్న ప్రభుత్వ శాఖ గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. సౌకర్యాలు, పాఠకుల వివరాలను లైబ్రేరియన్ గోపిని అడిగి తెలుసుకున్నారు. పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువజన విద్యార్థులకు సీడీఎస్ మాజీ అధ్యక్షురాలు తోడే పద్మారెడ్డి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఉచిత భోజన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు మత్తమారి సూరిబాబు, నాతరి స్వామి, చిలుముల శంకర్, ముచ్చర్ల మల్లయ్య, కంకణాల పద్మారెడ్డి, రొద్ద శారద, లెంకల శ్రీనివాస్, రామగిరి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుడి మృతికి సంతాపం

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన సింగరేణి కార్మికుడు రాజు మృతదేహాన్ని శనివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సందర్శించారు. రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి వద్ద మృతుడు రాజు భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రమాద ఘటన వివరాలను తోటి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. రాజు మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. మృతుడి కుటుంబానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి ఏరియా జీఎంతో మాట్లాడతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు కారుకూరి రాంచందర్, దావ రమేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు, తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కాసిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల సమీపంలో శనివారం షేక్ ముర్తుజ తన తండ్రి పీర్‌మహ్మద్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరై ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహాన్ని తీర్చే సామాజిక సేవ చేస్తున్నందుకు అభినందించారు. అనంతరం తెలంగాణ మోడల్‌స్కూల్‌ను సందర్శించి వాటర్‌ట్యాంకుకు భూమిపూజ చేశారు. మండలంలో సమస్యల పరిష్కారానికి దశల వారీగా కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, నాయకులు పుస్కూరి వంశీ, కుమారస్వామి, జాని, నరేష్, రాజన్న , అరవింద్, రెహ్మాన్, షారుఖ్, బోయిని మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



తాండూర్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నందుకు మండలంలోని ఆవోపా నాయకుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక గాంధీచౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆవోపా నాయకులు వొజ్జల రాజమౌళి, సుదర్శన్, కిరణ్‌కుమార్, సత్యనారాయణ, రవీందర్, సత్తయ్య, నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల ఏర్పాటు అభినందనీయం

తాండూర్: రాష్ట్రంలోని అన్ని కుల వృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని మేరు సంఘం మండల అధ్యక్షుడు మంతెన శివకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో శనివారం మేరు కులసంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

ఘనంగా పోషణ పక్వాడా



ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి–1 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక మాట్లాడారు. ఆరు నెలల వరకు పిల్లలకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తర్వాత అదనపు ఆహారం ఇవ్వాలని చెప్పారు. చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, గర్భిణులు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు భూమిపూజ



నెన్నెల: భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ హరీశ్‌గౌడ్

తాండూర్/నెన్నెల/వేమనపల్లి: నెన్నెల మండల కేంద్రంలోని బెస్తవాడ, సుంకరివాడలో, వేమనపల్లి మండలంలోని సుంపుటం, ముల్కలపేట, కేతన్‌పల్లి, నీల్వాయి, దస్నాపూర్, గొర్లపల్లి, జిల్లెడ, చామనపల్లి గ్రామాల్లో, తాండూర్ మండలంలో పోచంపల్లి, మాదారం–3 ఇంక్లైన్, రాజీవ్‌నగర్, తాండూర్, బోయపల్లి, కిష్టంపేట, కొత్తపల్లి గ్రామాల్లో తాగునీటి బోర్ల నిర్మాణానికి శనివారం ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఒక్కో బోరు మోటారుకు రూ.2లక్షల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నెన్నెల మండలంలో గొల్లపల్లి ఎంపీటీసీ బొమ్మెన హరీశ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు తోట శ్రీనివాస్, చెన్నోజు శంకరయ్య, గట్టు బానేష్, మొహిద్‌ఖాన్, శ్రీనివాస్, వేమనపల్లిలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్‌ఆలీ, మండల కో ఆప్షన్ సభ్యుడు జాహెద్‌ఆలీ, మాజీ వైస్ ఎంపీపీ రాజన్న, మాజీ సర్పంచ్‌లు రామచంద్రం, గాలి మధు, తాండూర్‌లో ఎంపీటీసీలు సూరం రవీందర్‌రెడ్డి, సిరంగి శంకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రత్నాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈసా, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహిళా సాధికారక సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారక హబ్‌జెండర్ స్పెషలిస్టు మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సికలు విద్యార్థులతో మాట్లాడుతూ.. మహిళల కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బేటీ బచావో బేటీ పడావో పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైం, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ 14567, సైబర్ క్రైమ్ 1930, పోక్సో యాక్ట్ నేషనల్ ఎమర్జెన్సీ సుకన్య సంవృద్ధి యోజనా, మిషన్ వాత్సల్య, ఆడపిల్లల ప్రాముఖ్యతను వివరించారు.

అక్రమవెంచర్ల పై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న మధుకర్

భీమారం: మండలంలో వ్యవసాయ భూముల్లో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలని భీమారం గ్రామానికి చెందిన సిరిపురం మధుకర్ అనే యువకుడు శనివారం ఎంపీడీవో రాధకు పిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ ఆధాయానికి గండి పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

సరిహద్దులో అప్రమత్తం

కోటపల్లి: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుపై ఇరు రాష్ట్రాలు అప్రమత్తం అయ్యాయి. శనివారం రాపన్‌పల్లి ప్రాణహిత నది ప్రాంతాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సిరోంచా తాలూకా సీఐలు సమాధాన్ చౌహన్, సుదర్శన్ కాట్కార్ సందర్శించారు. కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెన్యువల్ చేయాలి

మంచిర్యాలటౌన్: గత కొన్నేళ్లుగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న తొమ్మిది మంది సిబ్బందిని రెన్యువల్ చేసుకోవాలని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సులేమాన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ నెల 31తో ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియోగ్రాఫర్, ఎలక్ట్రీషియన్, డ్రైవర్, సి–ఆర్మ్ టెక్నీషియన్, జే.ఎస్.డబ్ల్యూ, దోబీల కాల పరిమితి ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి, సీహెచ్.సంతోశ్, బి.మానస, కె.మధుకర్, విజయ్‌కుమార్, అశ్విన్, రవీందర్, శంకర్, సంపత్ పాల్గొన్నారు.

18న వైద్య శిబిరం

శ్రీరాంపూర్/చెన్నూర్: నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో సోమవారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు తెలిపారు. దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగర్, కీళ్లనొప్పులు, నడుంనొప్పులకు పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. చెన్నూర్ పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాల్లో ఈ నెల 18న గర్మిళ్ల లయన్స్ క్లబ్, రేకుర్తి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు.

పేద యువతి పెళ్లికి ఆర్థిక సాయం

నెన్నెల: మండలంలోని మైలారంకు చెందిన వేల్పుల రాజయ్య–భూమక్క నిరుపేద దంపతుల కూతురు వివాహం ఈ నెల 17న ఉంది. కూతురు తండ్రికి మతిస్థిమితం లేక అనారోగ్యంతో మంచానికే పరిమితయ్యాడు. విషయం తెలుసుకున్న దాతలు ముందుకు వచ్చి రూ.65 వేల నగదును శనివారం ఆ పేద కుటుంబానికి అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

పాతమంచిర్యాల: జిల్లాలోని గుడిపేట గ్రామానికి చెందిన పెయింటర్ కార్మికుడు దొరిశెట్టి రాజన్న ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులను శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పడాల రామన్న, ప్రధాన కార్యదర్శి సదానందం, పట్టణ అధ్యక్షుడు మల్క చంద్రయ్య పరామర్శించారు. మృతుడి భార్య అరుణకు రూ.16వేల నగదును అందజేశారు.

జంతువులకు పండ్లు, నీరు పంపిణీ

జైపూర్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ(ఏబీఏపీ) ఆధ్వర్యంలో శనివారం జైపూర్ సమీపంలో గల మల్లన్నస్వామి ఆలయ అటవీప్రాంతంలో ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంచు రాజ్‌కిరణ్, ప్రధాన కార్యదర్శి ఎల్క సంతోశ్, ఉపాధ్యక్షుడు ఒడ్నాల రవీందర్ జంతువులు(కోతులు), పక్షులకు పండ్లు, నీరు, చిరుధాన్యాలు పంపిణీ చేశారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు

కాసిపేట: మండలంలోని ఎంపీపీఎస్ చింతగూడ పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, అంగన్‌వాడీ టీచర్ పల్లవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సన్మానం

కాసిపేట: మండలంలోని చిన్నధర్మారంలో శనివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పత్తి వెంకటకృష్ణను బీజేపీ కాసిపేట మండల అధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

పోతపల్లిలో పశువైద్య శిబిరం

లక్సెట్టిపేట: మండలంలోని పోతపల్లిలో పశువైద్యాధికారులు పశు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 91పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారిని శ్వేత, సిబ్బంది అభిలాష్ ఉన్నారు.

అవసరం లేని చోట రోడ్డు

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో అవసరం లేని చోట రోడ్లు వేస్తున్నారని ఈ పనులు ఆపివేయాలని, ఆ వార్డుకు చెందిన జే. నర్సింగ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణును శనివారం మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కేవలం కొందరి వ్యక్తిగత అవసరాల కోసం రోడ్డు వేసి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని వెంటనే ఈ పనులు నిలిపివేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల రాస్తారోకో



రామకృష్ణాపూర్: ఆందోళన చేస్తున్న నాయకులు

చెన్నూర్: తెలంగాణ భారత సమితి సీనియర్ నాయకురాలు ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం చెన్నూర్ పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా కవితను అరెస్ట్ చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాల నాయకులు ప్రజా ప్రతినిధులు మోతె తిరుపతి, రెవెల్లి మహేశ్, సాధనబోయిన కృష్ణ, రాంలాల్‌గిల్డా, రాకేశ్‌గౌడ్, పెండ్యాల లక్ష్మణ్, భారతిలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఎమ్మెల్సీ కవితపై ఈడీ అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేయడం అన్యాయమని మందమర్రి పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పట్టణంలో నిరసన చేపట్టారు. స్థానిక సాయిబాబా గుడి కూడలి వద్ద కోల్‌బెల్ట్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. కాసేపటికి ఎస్సై రాజశేఖర్ నిరసనకారులను విరమింపజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

రామకృష్ణాపూర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా మంచిర్యాల–నాగ్‌పూర్ హైవే మార్గమధ్యంలోని గద్దెరాగిడి వద్ద బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపడంతో వాహనాలు పెద్ద సంఖ్యలో స్తంభించిపోయాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ రాజరమేష్, గాండ్ల సమ్మయ్య, జాడి శ్రీనివాస్, రామిడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం ఎంచుకొని చదవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకోవాలని బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ అన్నారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా వినాలని సూచించారు. ఎంఈవో మహేశ్వర్ రెడ్డి, సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తదితరులు మాట్లాడారు. మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇతర ప్రాంతాల సంక్షేమ గురుకులాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, శ్రీనాథ్, స్వరూప, సంతోష్, సంగీత, వైస్ ప్రిన్సిపాల్ కోటరాజ్‌కుమార్, జేవీపీ పొన్నం శ్రీనివాస్, సూపరింటెండెంట్ అవధూత రాజశేఖర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి డీఎల్‌పీఓగా సబ్దర్‌ఆలీ



సబ్దర్‌ఆలీని సన్మానిస్తున్న డీపీఓ, తోటి అధికారులు

భీమిని: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ సబ్దర్‌ఆలీ బెల్లంపల్లి డీఎల్‌పీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ ఉత్తర్వుల మేరకు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీఎల్‌పీఓ ధర్మరాణి, మండల పంచాయతీ అధికారులు శ్రీపతి బాపురావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ కూసింది.. ఫ్లెక్సీ తొలగింది



దండేపల్లిలో ఓ పార్టీ ఫ్లెక్సీ తొలగిస్తున్న సిబ్బంది

దండేపల్లి: లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో దండేపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కట్టిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, గోడరాతలు, పోస్టర్లను పంచాయతీ సిబ్బంది తొలగించారు.

ఎస్సై బదిలీ కావాలని మొక్కుకున్న బాధితుడు

- బదిలీ అనంతరం మొక్కు చెల్లించిన వైనం



మొక్కు చెల్లించుకుంటున్న తిరుపతి

మంచిర్యాలక్రైం: జిల్లాలోని జన్నారం పోలీస్‌స్టేషన్‌లో కొంత కాలంగా ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఎస్సై బదిలీ కావాలని జన్నారంకు చెందిన సీపీఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి దేవుడికి మొక్కుకున్నాడు. ఇటీవల జరిగిన ఎస్సైల బదిలీల్లో భాగంగా ఆయన బదిలీ కావడంతో అనంతరం అతడు మొక్కుకున్న మొక్కును పైడిపల్లిలోని హన్మంతుడి గుడి వద్ద 51కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్న ఘటన చర్చనీయాంశమైంది. సంబంధం లేని విషయాల్లో వేధింపులకు గురి చేసేవాడని, ఇలాంటి ఎస్సై మళ్లీ జన్నారం రావద్దంటూ హన్మంతున్ని కోరుకుంటూ మొక్కులు చెల్లించడం గమనార్హం.

టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులకు శనివారం టాస్క్ ఆధ్వర్యంలో అప్టిట్యూట్ అండ్ రీజనింగ్ అనే అంశంపై ట్రైనర్ జే.రాజేశ్ శిక్షణ అందించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగియగా, ట్రైనర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి, టాస్క్ కో ఆర్డినేటర్ టి.కవితారాణి, అధ్యాపకులు సన్మానించారు.

హెలికాప్టర్ చక్కర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలో వారం రోజులుగా ఓ హెలీక్యాప్టర్ చక్కర్లు కొడుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అంతా అయోమయానికి గురవుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద్దంపేట, కర్ణమామిడి, పద్మనపల్లి గ్రామాల్లో ఇటీవల ఓ హెలీక్యాప్టర్ ద్వారా గూగుల్ కంపెనీ ఆధ్వర్యంలో భూముల మ్యాపింగ్ చేస్తుందని సమాచారం.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ బాలరాజ్, నిర్వాహకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ పునరావాస కాలనీలో శ్రీమల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. జిల్లా నలుమూలల నుంచి 20 జట్లు పాల్గొనగా ముల్కల్ల గ్రామానికి చెందిన మహిమా వాటర్ ప్లాంట్, లక్సెట్టిపేట మండలం అంకతిపల్లి గ్రామానికి చెందిన యాదవ్స్ కబడ్డీ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. మహిమా వాటర్ ప్లాంట్ జట్టు విజేతగా నిలువగా, అంకతిపల్లి జట్టు ద్వితీయ విజేతగా నిలిచింది. నగదు బహుమతులు ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, నిర్వాహకులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు గోపు లింగయ్య, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, కోశాధికారి రమేశ్, కబడ్డీ పోటీ నిర్వాహకులు మధూకర్, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, సంతోశ్, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీనగర్‌లో రూ.4.20లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను శనివారం వార్డు కౌన్సిలర్ బొద్దుల రమ్య ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.